# అపరిచితులు

-పోట్లూరు సుబ్రహ్మణ్యం

లక్నో ఎక్స్‌ప్రెస్ లక్కీగా రైట్ టైములోనే వెళ్తోంది. కంపార్టుమెంటులన్నీ రద్దీగా ఉన్నాయి. ప్రయాణీకులు పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు.

"ట్రెయిన్ యాక్సిడెంటులో మరణించిన వాళ్లు దయ్యాలై రైళ్ళలోనే తిరుగుతుంటారుట" అన్నాడొక వ్యక్తి.

"ఆ... ఇంకా మూఢనమ్మకాలేమిటండీ. దయ్యా లెక్కడున్నాయండి" అన్నాడు ఎదుటి వ్యక్తి.

"దయ్యాన్ని నేను చూశానయ్యా" అన్నాడు ఒక నడి వయసాయన. ఆయన పేరు రామదాసు.

"అవును. నేను ఒకరోజు బిజినెస్ పనిమీద మద్రాసు వెళ్లి ఇదే ట్రెయిన్‌లో తిరిగి వస్తున్నాను. ఒంగోలు స్టేషనులో సూటు, బూటు, హేటుతో ఒక ప్రత్యేకమైన శైలిలో ఉన్న వ్యక్తి నా దగ్గరకు వచ్చి, 'సార్, మీ బ్యాగులో ఉన్న పేపరు ఇస్తారా, చూసిస్తాను' అన్నాడు. నేను ఆశ్చర్యపోయాను. బ్యాగులోంచి బట్టల అడుగున ఉన్న పేపరు తీసిచ్చాను. అప్పుడు సమయం సరిగ్గా మధ్యాహ్నం పన్నెండు గంటలు. బండి బయలుదేరి వేగం అందుకుంది.

నాకేదో అనుమానమొచ్చింది. కాళ్ల వైపు చూశాను. కాళ్ల దగ్గర ప్యాంటు చివరి అంచులు బోసిగా కనిపించాయి. పాదాలు గాని, బూట్లు గాని ఏమీ లేవు. భయపడుతూనే మెల్లగా తల తిప్పి పేపరు వెనుకనున్న అతని ముఖం వైపు చూశాను. ఆశ్చర్యం... అతని కళ్లు ఉండవలసిన చోట లేవు. అవి ముఖంలోంచి ముందుకు ఒక అరడుగు సాగి పేపరు మీద భూతద్దం పెట్టి అక్షరాలు చదివినట్లు కనుగుడ్లు అక్షరాల మీద జరుగుతున్నాయి.

అతడు ఇది గమనించి, కోపంగా పేపరు నా ముఖం మీద విసరికొట్టి 'ఉద్ధరించావులే' అంటూ అదృశ్యమయిపోయాడు. అది ఇప్పటికీ తలచుకుంటే భయంగా ఉంది" అన్నాడు రామదాసు.

"అహహ... ఎంత గొప్ప వాళ్లండీ మీరు. సాక్షాత్తూ దయ్యాన్ని చూసిన అదృష్టవంతులు" అంటూ ఒక పాసింజరు చేయి చాపి కరచాలనం తీసుకొని అభినందిస్తే.. అందరూ అదేవిధంగా అభినందిస్తూ రామదాసు దగ్గర కరచాలనం తీసుకున్నారు.

ఇంతలో 'చాయ్.. చాయ్' అంటూ టీ వెండరు వచ్చాడు. ఒక టీకి ఆర్డరిచ్చాడు రామదాసు. వెండరు ప్లాస్టిక్ కప్పులో పోసిచ్చిన వేడి టీని చప్పరిస్తూ, "నీకు టీ వెండరు వేలాయుధం తెలుసటోయ్" అన్నాడు.

అప్పటికే ట్రెయిను ఒంగోలు దాటింది.

"తెలియదు సార్"

"అయినా ట్రెయిను యాక్సిడెంటులో పదేళ్ల క్రితం చనిపోయిన వేలాయుధం నీకు తెలియదంటే ఆశ్చర్యంగా ఉంది."

"మీది మరీ విడ్డూరంగా ఉంది సార్. పదేళ్ల క్రితం చనిపోయినవాడు, నాలుగేళ్ల క్రితం ఉద్యోగంలో చేరిన నాకు కనిపిస్తాడా. జోకులెయ్యకండి సార్. జోకులు"

"జోకులు కాదోయ్ వాస్తవం. వేలాయుధం చనిపోయింది నిజమే. అతని ఆత్మ మాత్రం ఏదో ఒక రూపంలో ఎవరికో ఒకరికి సహాయం చేస్తూ కనిపిస్తూనే ఉంటుంది. నీకు ఇప్పటివరకూ కనిపించలేదంటే నువ్వు నిజంగానే దురదృష్టవంతుడవోయ్."

"అయ్యా. అలాంటి దయ్యాల మాటలు చెప్పకండి. పిల్లవాడు జడుసుకొంటున్నాడు" అప్పుడే ఏడుపందుకున్న రెండేళ్ల కొడుకుని చూపిస్తూ అంది ఓ పల్లెటూరి స్త్రీ. అవునన్నట్లు చూశాడు ఆమె భర్త అయిన పల్లెటూరి యువకుడు.

"వాడు ఎందుకేడుస్తున్నాడో బాగా గమనించండి. వాడు సంచి చూపిస్తూ ఏడుస్తున్నాడు. వాడికిష్టమయిందేదో సంచిలో ఉన్నట్లుంది. అదివ్వండి. ఏడుపాపే స్తాడు" అన్నాడు రామదాసు.

"ఇంకెంతకాలం బ్రతుకుతానో తెలియదు. పాపిష్టివాడ్ని. ఈ కళ్లకు ఒక్క దయ్యాన్ని చూసే యోగం కూడా పట్టలేదు. ఆ పుణ్యాత్ముడు వేలాయుధం కథ, ఈ పాపాత్ముడు పరశురామయ్య చెవులకు వినిపించు నాయనా" అన్నాడొక వృద్ధుడు.

అందరూ ఆతృతగా, ఆలస్యం భరించలేనట్లుగా చూశారు.

"వేలాయుధం తెనాలి రైల్వే స్టేషనుకు చెందిన టీ వెండరు. అటు విజయవాడ స్టేషను నుంచి, ఇటు ఒంగోలు స్టేషను వరకు అతను టీలు అమ్ముతాడు. యాభై టీలు స్టీలు డ్రమ్ములో పోసుకుని వస్తే పెట్టె

పెట్టెకూ తిరుగుతూ టీలు అమ్మేవాడు. ఎప్పుడైనా డ్రమ్ములో యాభై కప్పులు అమ్మిన తరువాత ఏదైనా మిగిలితే అమ్మేవాడు కాదు. వాటిని ముష్టివాళ్లకు ఉచితంగా ఇచ్చేవాడు."

"వేలాయుధం ఎలా చనిపోయాడు సార్" ఆత్రతగా అడిగాడు టీ వెండరు, తన వృత్తివాడి ఔన్నత్యానికి జోహారులర్పిస్తూ.

"అదే చెబుతున్నాను. ఒకసారి వేలాయుధం డ్రమ్ములో టీ నింపుకొని ఒంగోలు వరకు అమ్మి తిరుగు ప్రయాణంలో తెనాలి వస్తున్నాడు. రైలు తెనాలి సమీపించింది. అప్పుడు సమయం అర్ధరాత్రి పన్నెండు గంటలు. అతను ఇంజను ప్రక్కనే ఉన్న మొదటి కంపార్టుమెంటులో ప్రయాణిస్తున్నాడు. ట్రెయిను ప్లాటుఫారం మీదకు రాగానే రన్నింగ్‌లో దిగి, మళ్లీ డ్రమ్ములో టీ నింపుకొని అదే ట్రెయిను లాస్టు కంపార్టుమెంటు రన్నింగ్‌లో పట్టుకోవాలనేది అతని ఆలోచన. ఇది అతనికి రోజూ అలవాటే.

రైలు ఇంజను ప్లాటుఫారం మీదికి ఎంటరు కాగానే ప్రక్క పెట్టెలోనే ఉన్న వేలాయుధం, ఒక చేత్తో ఖాళీ డ్రమ్ము పట్టుకొని రైల్లోంచి దిగేశాడు. సెకండ్ల తేడాలో అతని అంచనా తప్పయింది. ప్లాటుఫారం నాలుగడుగులు ముందుండగానే దిగేశాడు. ఇంకేముంది. కాళ్ల క్రింద భూమి అందక స్లిప్పయి ట్రెయిను క్రింద పడిపోయాడు."

వింటున్న అందరూ "అయ్యయ్యో" అంటూ హాహాకారాలు చేశారు. అందరి హృదయాలూ భారమయ్యాయి.

"అయితేనేం. అతను భౌతికంగా చనిపోయినా, అతని ఆత్మ ఇంకా బ్రతికే ఉంది."

"ఇది నిజమా?" అందరూ నివ్వెరపోయారు.

"అవును. అయిదేళ్ల క్రితం ఒకరోజు అర్ధరాత్రి తెనాలి ప్లాటుఫారం మీద మద్రాసు ట్రెయిన్ కోసం ఎదురు చూస్తున్నాను. ప్రయాణీకులు బెంచీల మీద కునికిపాట్లు పడుతున్నారు. నేను ఏమీతోచక ప్లాటుఫారం చివరి వరకు నడుచుకుంటూ వెళ్లాను. అక్కడ లైట్లులేవు. పిండారబోసినట్లు వెన్నెల కావడంతో అంతా స్పష్టంగా ఉంది. ప్లాటుఫారం చివరకు వెళ్లి చల్లని గాలి పీలుస్తున్నాను. తిరిగి వెళ్దామని ఇటు తిరి గాను. నా కెదురుగా తెల్లని యూనిఫారంలో నీట్‌గా ఉన్న టీ వెండరు. స్టీలు డ్రమ్ము ఒక చేతిలో, కప్పులు మరొక చేతిలో ఉన్నాయి. 'చాయ్ త్రాగండి సార్' అంటూ డ్రమ్ము క్రింద పెట్టి కప్పులోకి టీ వంచాడు. టీ త్రాగి జేబులోంచి డబ్బు తీసి ఇవ్వబోయాను. "సార్ ఈ వేలాయుధం ఎవరి దగ్గరా 'చాయ్'కి డబ్బు తీసు కోడు సార్" అంటూ నా కళ్లముందే అదృశ్యమయిపోయాడు.

నాకు ఒకవైపు ఆశ్చర్యం, మరోవైపు భయం. తొందర తొందరగా స్టేషను దగ్గరకొచ్చి క్యాంటీన్‌లో వెండరు వేలాయుధం కోసం వాకబు చేశాను. "అయిదు సంవత్సరాల క్రితం చనిపోయిన మా వెండరు వేలా యుధం, అందరు వెండర్లలో ఆణిముత్యం సార్. వాడి ఆత్మ అలా ప్రత్యక్షమై 'చాయ్‌లు' ఇస్తుంటుంది సార్" అంటూ మిగతా వెండర్లంతా వేలాయుధాన్ని మెచ్చుకొని అతని కథంతా చెప్పారు. నేను ఇప్పటికీ తెనాలి రైల్వే ప్లాటుఫారం మీద గడిపే అవకాశం వస్తే వేలాయుధం దగ్గర టీ త్రాగుతుంటాను. మీరూ ఎప్పుడైనా ప్రయత్నిం చవచ్చు" చెప్పడం పూర్తిచేశాడు రామదాసు.

"అతను భౌతికంగా చనిపోయినా అతని ఆత్మ ఇంకా బ్రతికే ఉందన్నమాట. ఈ రోజుకీ రాత్రి పన్నెండు గంటల సమయంలో ఎవరైనా ప్లాటుఫారం ఆ చివర గాని, ఈ చివరకు గాని వెళ్తే వేలాయుధం తప్పక కని పిస్తాడు. అంతేకాదు, మీకు ఉచితంగా టీ కూడా ఇస్తాడు" అన్నాడు మళ్లీ.

వింటున్న అందరూ వేలాయుధం ఆత్మకు మనసులోనే నివాళులర్పించారు.

ఇంతలో ఎదురుగా ఉన్న స్త్రీ పెద్దగా అరిచింది. "మా బాబు. బాబు కనిపించడంలేదు"

ఆమెలాగే పల్లెటూరి వాడయిన ఆమె భర్త కూడా కంగారు పడిపోయాడు. అందరూ పిల్లవాడి కోసం కంపార్టుమెంటంతా వెతకసాగారు. ఎక్కడా కనిపించలేదు.

"ఏడుస్తున్న పిల్లవాడికి సంచిలోని రంగుల బాలి

## గర్భగుడి

భక్తి ఎక్కువయిందా
కోవెలలన్నీ మూకుమ్మడిగా
కిటకిటలాడుతున్నాయి...
పాప పరిహారం / ప్రక్షాళన మాత్రమే
బైటకొచ్చేక కథ మామూలే
లోన కూడా రికమెండేషన్లే!

**-జి. శైలూషి**

చ్చాను. వాడు ఆడుకుంటూ ఎటు వెళ్లాడో? ఏమయి పోయాడో??" భోరున ఏడుస్తోంది ఆ స్త్రీ. అది జనరలు కంపార్టుమెంటు అయినందున ప్రక్క పెట్టెకు వెళ్లడానికి కూడా దారుండదు.

"ఏం భయపడకండి. వెండరు వేలాయుధం మనకు తప్పక సాయం చేస్తాడు" అన్నాడు రామదాసు శాంతంగా.

అందరూ వెతుకుతూ పెట్టె చివరి వరకూ వచ్చారు. 'ఆగండి' అంటూ అరిచాడు రామదాసు. రెండేళ్ల బాబు, మొదటి మెటు చేత్తో పట్టుకొని, ఆఖరు మెట్టు మీద కాళ్లు పెట్టుకొని నిలబడి ఉన్నాడు. ఏదో అదృశ్య శక్తి వెనుక నుంచి పట్టుకొని వస్తున్నట్లుగా ఉన్నాడు.

రన్నింగ్‌లో అలవాటున్న టీ వెండరు, ఆ బాబుకి కాళ్లు తగలకుండా కడ్డీ పట్టుకొని క్రింద మెట్టు మీదికి దిగి, బాబుని జాగ్రత్తగా పెట్టెలోకి తీసుకువచ్చాడు. సొమ్మసిల్లి పడి ఉన్న పల్లెటూరి స్త్రీ పిల్లవాడి ఏడుపు విని, లేచి వాడ్ని ఎత్తుకొని ముద్దులాడింది. బండి తెనాలి స్టేషన్లో వచ్చి ఆగింది.

"వెండరు వేలాయుధం అన్నకు ఇంటికి వెళ్లగానే కొబ్బరికాయ కొడతాను. నా బిడ్డను కాపాడినందుకు అతని పేరు మీద సంతర్పణ చేస్తాను" అన్నాడు ఆమె భర్త అందరికీ నమస్కారాలు పెడుతూ.

'వేలాయుధం వేరీగుడ్' అనుకున్నారు కంపార్టు మెంటులోని వాళ్లంతా.

"చచ్చిపోయినవాడే ఇంత సాయం చెయ్యంగా లేంది, బ్రతికున్న మనం ఇంకెంత సాయం చేయాల" అన్నాడొకాయన పౌరుషంగా.

"భేష్. భలేగా చెప్పావయ్యా. మేమంతా దీనికి కట్టుబడి ఉంటాం" అన్నారు పెట్టెలోని వాళ్లంతా.

నవ్వుకున్నాడు హరికథలు చెప్పే హరిదాసు రామదాసు.

'పూర్వం పెద్దవాళ్లు, పిల్లలు, పెద్దవాళ్లు ఇష్టపడే జానపద కథలు చెబుతూ వాటిలో నీతిని, మంచిత నాన్ని, మానవత్వాన్ని జోడించేవాళ్లు. వాళ్ల మనసును మానవ త్వం వైపు మళ్లేట్లు చేసేవారు. ఇప్పుడు తను చెప్పింది అభూత కల్పనే. అయితే మాత్రం ఏం? మార్పు తెచ్చాడు. చిన్నపిల్లలకు దేన్నయినా కరచి పట్టుకోవడం అలవాటు. అందుకే పిల్లవాడు మెట్టును గట్టిగా కరచి పట్టుకున్నాడు. అది పిల్లల నైజం. అందులోనూ బండి స్టేషన్ను సమీపించి వేగం తగ్గింది. అందుకే వాడు బ్రతికి బట్టకట్టాడు' తృప్తిగా మనసులోనే అనుకున్నాడు రామదాసు. ■

## బాల్యానికి రెక్కలుంటే..

బాల్యమెంత అపురూప దృశ్యమో
నెమరేస్తున్న గతాన్ని తడుముతుంటే
అనుభూతమవుతోంది

అల్లరి చిల్లరిగా ఆడిపాడినపుడు
అలసి సొలసి గోల చేసినపుడు
ఉల్లాసభరితమైన అనుభవాలకు లోనైనపుడు
ప్రతి ఊసులోనూ ప్రతి మాటలోనూ
అనుదిన కదలికలోనూ
తనివితీరని ఉత్సాహమే ఉట్టిపడుతుండేది

గోరువెచ్చని ఉదయాలు
గరికపచ్చని సాయంత్రాలు
ఒక్కో దృశ్యం ఒక్కొక్క సందర్భం
ఒక్కో సన్నివేశం ఒక్కొక్క ఆరాటం
అన్నింటిని కలగలిపి కుడితే
తీపిగుర్తుల బాల్యమవుతుంది

ఒంటరితనంలోనూ జనసమ్మర్దంలోనూ
ఏడుపురాగంలోనూ అనంత స్వేచ్ఛలోనూ
పట్టరానంత ఆనందముండేది
విప్పలేనంత విశాల జీవితం దాగుండేది
బాల్యానికి
అసలు అర్థాన్ని వెదికి పట్టుకోవాలంటే
ఇప్పటికప్పుడు
మళ్లీ మనం చిన్న పిల్లాళ్ళమైపోవల్సిందే.

బోసినవ్వుల నుంచి విస్మయపు చూపులదాకా
ఉద్వేగపుటంచుల నుంచి పసిఊహల కుదుపుల దాకా
అన్నీ మూకుమ్మడిగా
పట్టుకుంటే జారిపోయే క్షణాలు
బతుకు పొడుగునా ప్రవాహపు జ్ఞాపకాలు
కాలానికి ఇరువైపులా
స్మృతుల గిలిగింతలు పెడుతుంటాయి

మనిషి జీవితంలో / ఎంతెత్తుకి ఎదిగినా
బాల్యం ముందు / ఎప్పటికీ
పసిపిల్లాడిగానే కనిపిస్తాడు

ఆ లోకమే వేరు / చిన్ననాటి ప్రపంచమే వేరు
రోజులు మారినా / ఆలోచనలు దూరమైనా
అప్పటి / చేతలు మాత్రం
ఇంకా పట్టి కుదుపుతూనే ఉన్నాయి!

-మానాపురం రాజా చంద్రశేఖర్